## క్లుప్తంగా

### పారిశుద్ధ్య నిర్వహణపై శిక్షణ



**మదనాపురం:** మండలంలోని నర్సింగాపురంలో మంగళవారం పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లకు పారిశుద్ధ్య నిర్వహణ శిక్షణ ఇచ్చారు. మరుగుదొడ్లు, ఇంకుడు గుంతలు తదితర అంశాలపై వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ భాగ్యలక్ష్మమ్మ, ఎంపీఓ పుష్ప పాల్గొన్నారు.

### స్వపరిపాలన దినోత్సవం

**పెబ్బేరు రూరల్:** శ్రీరంగాపురం మండలంలోని నాగరాల ప్రాథమిక పాఠశాలలో మంగళవారం విద్యార్థులు స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎంఈఓగా దివ్య, హెచ్ఎంగా స్వప్న వ్యవహరించారు. అనంతరం ఉత్తమ బోధన చేసిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

### క్రికెట్ పోటీలు ప్రారంభం



**కొత్తకోట రూరల్:** పెద్దమందడి మండలంలోని దొడగుంటపల్లిలో ఉగాది పండుగను పురస్కరించుకుని ఛత్రపతి యువజన సంఘం ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా స్థాయి క్రికెట్ పోటీలను సర్పంచ్ వరలక్ష్మి ప్రారంభించారు. వారం రోజుల పాటు పోటీలకు సంబంధించి అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినట్లు, మొదటి బహుమతి రూ.20వేలు నగదు అందిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

### పార్టీ బలోపేతానికి కృషి చేద్దాం



**వీపనగండ్ల:** రాబోయే ఎన్నికల్లో పార్టీ అధికారంలోకి వచ్చేందుకు కృషి చేయాల్సిన తరుణం ఆసన్నమైందని బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు శివాజీ అన్నారు. మంగళవారం గోపల్‌దిన్నెలో యువజన సంఘటన యాత్ర నిర్వహించారు. దేశంలో మోదీ పాలన అవినీతి రహితంగా సాగుతుందని రాబోయే ఎన్నికల్లో నియోజకవర్గంలో గెలుపొందడం ఖాయమని అన్నారు. కార్యక్రమంలో శ్రీకాంత్, నరేష్, వెంకటస్వామి గౌడ్, బాలకృష్ణ గౌడ్, రామకృష్ణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

### వచ్చే ఎన్నికల్లో పోటీలో టీడీపీ

**చిన్నంబావి:** వచ్చే ఎన్నికల్లో కొల్లాపూర్ నియోజకవర్గంలో టీడీపీ పోటీలో ఉంటుందని రాష్ట్ర కార్యదర్శి సుధాకర్‌నాయుడు తెలిపారు. రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ ఆదేశం మేరకు మండలంలోని బెక్కంలో మంగళవారం ఇంటింటికీ పార్టీ గతంలో చేసిన అభివృద్ధి గురించి కరపత్రాలను పంచారు. ఇప్పుడున్న ప్రభుత్వం ప్రజలకు చేస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో రమేష్‌సింగ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

### టిప్పర్ బోల్తా



**పాన్‌గల్:** క్వారీ నుంచి రాళ్ల తరలిస్తున్న టిప్పర్ అదుపు తప్పి బోల్తా పడిన సంఘటన మంగళవారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. మండల కేంద్రంలోని పాల్కి చెరువు సమీపంలోని క్వారీ నుంచి విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలోని క్రషర్‌కు రాళ్లు తరలిస్తున్న టిప్పర్ ఈద్గా సమీపంలో మలుపు వద్ద అదుపు తప్పి బోల్తా పడింది. సంఘటనలో డ్రైవర్ చాకచక్యంగా బయటపడ్డాడు. రోడ్డుపై వాహనాలు కొద్దిసేపు నిలిచిపోయాయి.

### చికిత్స పొందుతూ ఏపీజీవీబీ మేనేజర్ మృతి

**ఆత్మకూర్:** మండలంలోని బాలకిష్టాపూర్ చెందిన రాములునాయక్ (33) రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో పలువురు సంతాపం తెలిపారు. కర్నూల్‌లో ఏపీజీవీబీ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న రాములు నాయక్ శనివారం విధులు ముగించుకుని స్వగ్రామనికి వచ్చేందుకు ద్విచక్రవాహనంపై కర్నూల్ బస్టాండ్‌కు వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. వెంటనే హైద్రాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించగా, ఆదివారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మంగళవారం గ్రామంలో అంత్రక్రియలను నిర్వహించారు. మృతుడికి భార్య జ్యోతి, రెండునెలల చిన్న పాప ఉన్నారు.

# సంత స్థలం కాపాడాలని ఆందోళన



నిరసన తెలుపుతున్న నాయకులు

**పెబ్బేరు:** పట్టణ కేంద్రంలోని వేణుగోపాల స్వామి దేవాలయం భూమిలో నిర్వహిస్తున్న సంత స్థలాని కాపాడాలని సంత పరిరక్షణ సమితి సభ్యులు, అఖిల పక్షం నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణ కేంద్రంలోని స్థానిక సుభాష్ చౌరస్తాలో నిరసన తెలిపి మాట్లాడారు. రాష్ట్రంలో పేరుగాంచిన పెబ్బేరు సంత స్థలాన్ని కొందరు వ్యక్తులు అక్రమాలకు పాల్పడుతూ కబ్జా చేస్తున్నారని, ఈ సంత నిర్వహించటం వల్ల సుమారుగా 100 కుటుంబాలు బతుకుతున్నాయన్నారు. అక్రమార్కులు పూజారి పేరిట 30.19 కుంటల సంత భూమిని కట్టబెట్టారని తెలిపారు. అలాగే చరిత్ర కలిగిన సంతను, భూమిని కబ్జా చేస్తే సహించమన్నారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ జాన్ కృపాకర్, తహసీల్దార్ శాంతిలాల్, ఎస్ఐ జగదీశ్వర్‌రెడ్డి సంఘటన స్థలానికి చేరుకుని కోర్టు ఆదేశాల మేరకు నిబంధనలు పాటించాలని సూచించారు.

# ఎల్ఓసీ అందజేసిన మంత్రి



ఎల్ఓసీ అందజేస్తున్న మంత్రి నిరంజన్‌రెడ్డి

**వనపర్తి:** జిల్లా కేంద్రంలోని బ్రహ్మంగారివీధికి చెందిన వీరబాయి చికిత్స కోసం మంజూరైన రూ.2లక్షల ఎల్ఓసీని మంగళవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఆరోగ్య సమస్యలతో సాయం కోసం తనవద్దకు వస్తే.. పార్టీలకు అతీతంగా సహాయం చేస్తానని మంత్రి తెలిపారు.

**వనపర్తి క్రైం:** శస్త్ర చికిత్స చేయించుకున్న మంత్రి నిరంజన్‌రెడ్డిని మంగళవారం మైనార్టీ నాయకులు హైదరాబాద్‌లో పరామర్శించారు. జిల్లా కేంద్రంలోని పీర్లగుట్టపై అన్ని రకాల వసతుల కల్పనకై చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో జహంగీర్, జబ్బార్, అహ్మద్ తదితరులు ఉన్నారు.

# విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి



ఖిల్లాఘనపురంలో విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు అందిస్తున్న తహసీల్దార్

**ఖిల్లాఘనపురం:** ఇంటర్ పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని తహసీల్దార్ భాను ప్రకాష్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు మంగళవారం యువశక్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేశారు. పలు కార్యక్రమాల్లో భాగంగా నిర్వహించిన ఆటల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. మధు, ప్రిన్సిపాల్ రాధ, అధ్యాపకులు పాల్గొన్నారు.

**పెబ్బేరు:** పట్టణంలోని మాడల్ స్కూల్ ఆల్ మూన, ఈసా ఎడ్యుకేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లను ఎంఐఎం పట్టణ అధ్యక్షుడు అఫ్రోజ్ అందించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రహీం, జమీర్, జాకీర్, ఆరీఫ్, మస్తాన్, అమర్, ఖాలీద్ పాల్గొన్నారు.



పెబ్బేరులో..

# ఇంటర్ పరీక్షల ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న తహసీల్దార్ పాండునాయక్

**వీపనగండ్ల:** మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం నుంచి నిర్వహించనున్న ఇంటర్ పరీక్షల ఏర్పాట్లను మంగళవారం తహసీల్దార్ పాండునాయక్ పర్యవేక్షించారు. హాజరయ్యే విద్యార్థులకు కనీస వసతులు, వైద్య సదుపాయం కల్పించాలని ప్రిన్సిపాల్ రాంరెడ్డిని ఆదేశించారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో 108 మంది, ద్వితియ సంవత్సరంలో 77 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు.

**ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి**

**కొత్తకోట రూరల్:** ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర పరీక్షలకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినట్లు పెద్దమందడి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ భాస్కర్ మంగళవారం ప్రకటనలో పేర్కొన్నారు. ప్రథమ సంవత్సరం విద్యార్థులు 211మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 189మంది హాజరు కానున్నట్టు తెలిపారు.

# నిరంతరం విద్యుత్ సరఫరా చేయండి



అలంపూర్ చౌరస్తాలో విద్యుత్ ఏఈకి వినతి పత్రం అందజేస్తున్న బీఎస్పీ నాయకులు

**అలంపూర్:** రైతులకు నిరంతరాయంగా 24 గంటల విద్యుత్ సరఫరా చేయాలని బీఎస్పీ నాయకులు కోరారు. అలంపూర్ చౌరస్తాలోని విద్యుత్ సబ్ స్టేషన్‌లో ఏఈ సుబ్బరాయుడుకు బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు మహేష్, ఉపాధ్యక్షుడు సుంకన్న, మండల అధ్యక్షుడు నాగరాజు, కన్వీనర్ సురేష్‌లు వినతిపత్రం అందజేశారు. బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ బహుజన రాజ్యాధికార యాత్రలో భాగంగా అలంపూర్ మండలం గొందిమల్ల గ్రామాన్ని పర్యటించినట్లు తెలిపారు. ఈ గ్రామంలో 90 మంది వ్యవసాయ ద్వార జీవనం సాగిస్తున్నట్లు ఆయన దృష్టికి వచ్చినట్లు తెలిపారు. ఈ విషయాన్ని ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లిన పరిష్కారానికి ముందుకు రాలేదని పేర్కొన్నారు. అధికారులు స్పందించి ఆ గ్రామంలో నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని వినతిలో కోరారు.

# మున్సిపాలిటీని పరిశుభ్రంగా ఉంచుదాం..

**కొల్లాపూర్:** పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద మహిళలతో మున్సిపల్ కమిషనర్ రాజయ్య స్వచ్ఛ ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడారు. ఇళ్లల్లోని తడి, పొడి చెత్తను వేరు చేసి మున్సిపల్ వాహనాల్లో రోజువారీగా వేయాలని సూచించారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగస్వాములు కావాలని కోరారు. కొల్లాపూర్ మున్సిపాలిటీని పరిశుభ్రంగా ఉంచుదామన్నారు. మహిళా సంఘాల సభ్యురాళ్లు, మెప్మా సిబ్బంది, టౌన్ మిషన్ కోఆర్డినేటర్ ఫారుఖ్, ఎన్విరాల్‌మెంట్ ఇంజినీర్ జమీర్‌పాష పాల్గొన్నారు.




ప్రమాణం చేస్తున్న మహిళలు

# స్పృహతప్పి పడిపోయిన ఇంటర్ విద్యార్థి

**వనపర్తిటౌన్:** జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ సెకండ్ ఇయర్ చదువుతున్న వీపనగండ్లకు చెందిన విద్యార్థి నికిత్ తనకు హాల్ టికెట్ ఇవ్వలేదని మనస్తాపానికి లోనయ్యాడు. ఎంత బ్రతిమిలాడినా కళాశాల అధ్యాపకులు ఇవ్వకపోవడంతో మంగళవారం సాయంత్రం కళాశాల ఎదుట స్పృహతప్పి పడిపోయాడు. విషయం తెలుసుకున్న బంధువులు ఆస్పత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అందించారు. కళాశాల ఫీజు కొంత ఇవ్వాల్సి ఉన్నందుకే హాల్‌టికెట్ ఇవ్వకుండా వేధించారని కుటుంబ సభ్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న డీఐఈఓ జాకీర్ హుస్సేన్ ఆన్‌లైన్‌లో హాల్‌టికెట్ డౌన్‌లోడ్ చేసుకొని నేరుగా పరీక్ష కేంద్రంలోకి వెళ్లాలని, కళాశాల ప్రిన్సిపాల్‌ను బ్రతిమలాడాల్సిన అవసరం లేదని సూచించారు.

### హజ్రత్ బాగ్మార్‌సాబ్ గంధోత్సవం

**స్టేషన్ మహబూబ్‌నగర్:** హజ్రత్ సయ్యద్‌షా అసదుల్లా హుస్సేని ఉరఫ్ బాగ్మార్‌సాబ్ రహెమతుల్లా అలై దర్గా ఉర్సు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో ప్రధాన ఘట్టమైన గంధోత్సవం మంగళవారం చేపట్టారు. గంధోత్సవ ఊరేగింపు పాతపాలమూర్ ముతవల్లీ బాబుమియా ఇంటి నుంచి ప్రారంభమై జిల్లా జైలుఖానా, వన్‌టౌన్ చౌరస్తా, అశోక్‌టాకీస్, క్లాక్‌టవర్, పాన్ చౌరస్తా, రాంమందిర్ చౌరస్తా నుంచి దర్గా వరకు చేరుకుంది. అనంతరం దర్గాలో పూలు, చాదర్లు సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

### క్షయపై అవగాహన




అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది


**పాన్‌గల్:** మండలంలోని దావాజిపల్లి, మాందాపూర్‌లో నిక్షయ్ దివాస్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం క్షయపై ప్రజలు, విద్యార్థులకు అవగాహన కల్పించారు. మండల ఆరోగ్య విస్తరణ అధికారి శ్రీనివాసులు మాట్లాడుతూ.. దగ్గుతో పాటు జ్వరం, ఛాతిలో నొప్పి, తలనొప్పి, నీరసం, అలసట, ఆకలి, బరువు తగ్గడం, రాత్రి వేళలో చెమటలు పట్టడం వంటి లక్షణాలు ఉన్న వారు పరీక్షలు చేయించుకోవాలన్నారు. వైద్యుల సూచన మేరకు క్రమం తప్పకుండా ఆరు నెలల పాటు మందులు వాడితే రోగం నయమవుతుందన్నారు. రోగులకు ప్రభుత్వం నిక్షయ పోషణ అభియాన్ ద్వారా నెలకు రూ.500 అందిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎస్‌టీఎల్ఎస్ ప్రవీణ్, ఎస్‌టీఎస్ నాగేష్, సర్పంచ్‌లు వెంకటయ్యయాదవ్, జయరాములుసాగర్ పాల్గొన్నారు.

**ఖిల్లాఘనపురం:** మండలంలోని మానాజీపేట, సోళీపురం, ఉప్పరిపల్లి గ్రామాల్లో మంగళవారం టీబీ నివారణ దినోత్సవం సందర్భంగా ప్రజలకు అవగాహన కల్పించారు. ఆయా గ్రామాల్లో పాల్గొన్న సర్పంచ్‌లు సతీష్‌కుమార్, రాంరెడ్డి మాట్లాడుతూ టీబీని పూర్తి స్థాయిలో నివారించేందుకు ప్రభుత్వం మందులు అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు.

### నీటిని వృథా చేయొద్దు

**అమరచింత:** పట్టణంలోని ప్రజలు తమ ఇంటి నల్లాలకు ఆన్‌ఆఫ్‌లు ఏర్పాటు చేసుకుని, నీటి వృథాను అరికట్టాలని మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ ఖాజా మంగళవారం తెలిపారు. పబ్లిక్ కుళాయిలకు సైతం ఆన్‌ఆఫ్‌లు లేకపోవడంతో తాగునీరు వృథాగా పారుతుందని, అలాంటి ప్రదేశాలను గుర్తించి మున్సిపల్ సిబ్బందికి సమాచారం అందించాలన్నారు. పట్టణంలో కొత్తగా సీసీ రహదారులు వేస్తున్నారని, కొత్తగా కుళాయి అవసరం ఉన్న వారు వెంటనే కనెక్షన్ తీసుకోవాలన్నారు. సీసీ వేస్తున్న కాలనీలలో పైపులైన్‌లు త్వరితంగా పూర్తి చేసుకోవాలన్నారు.

### భక్తులకు అన్నదానం



అన్నదానం ప్రారంభిస్తున్న ఆలయ ఈఓ

**జోగుళాంబ శక్తిపీఠం:** కర్ణాటక నుంచి శ్రీశైలానికి పాదయాత్రగా వెళుతున్న భక్తులకు దేవస్థానంలో మంగళవారం అన్నదానం ఏర్పాటు చేశారు. ఈఓ పురేందర్‌కుమార్‌ను భక్తులకు భోజనం వడ్డించారు. నియోజకవర్గంలో కాలినడకన వెళ్తున్న వారికి తోచిన సాయం అందిస్తూ దైవ కృపాకటాక్షం పొందుతున్నారని ఈఓ పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ సేవదృక్పథం అలవర్చుకోవాలని కోరారు. కార్యక్రమంలో కర్ణాటక రాష్ట్ర భక్తులు, ప్రజలు పాల్గొన్నారు.

# ట్రాక్టర్ ట్రాలి బోల్తా: తప్పిన ప్రమాదం

**ఎర్రవల్లిచౌరస్తా:** జాతీయ రహదారిపై ట్రాక్టర్ ట్రాలి ప్రమాదవశాత్తు అదుపుతప్పి బోల్తా పడటంతో పెను ప్రమాదం తప్పిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పెబ్బేర్ మండలంలోని జనుంపల్లి నుంచి మిరప పిప్పితో వెళ్తున్న ఓ ట్రాక్టర్ ఎర్రవల్లి చౌరస్తాలోకి రాగానే ప్రమాదవశాత్తు అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ డ్రైవర్ వాసుతో పాటు అందులో ఉన్న వారికి ఎలాంటి గాయాలు కాకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. 44వ జాతీయ రహదారి నుంచి గద్వాలకు వెళ్లే మలుపులో ట్రాక్టర్ బోల్తా పడటంతో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ట్రాక్టర్‌ను, మిరప పిప్పిని జేసీబీ సహాయంతో తొలగించి ట్రాఫిక్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకున్నారు.



ఎర్రవల్లి కూడలిలో బోల్తాపడిన ట్రాక్టర్

# 'కంటివెలుగు'ను సద్వినియోగం చేసుకోండి

**పాన్‌గల్:** అంధత్వ నివారణ కోసం ప్రభుత్వం నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డా.మమతి, సర్పంచ్ శాంతమ్మ అన్నారు. మంగళవారం మండలంలోని తెల్లరాళ్లపల్లితండాలో కంటి వెలుగు శిబిరాన్ని వారు ప్రారంభించారు. కార్యక్రమంపై యువతీ, యువకులు, మహిళలు, విద్యావంతులు, రైతులు, స్థానిక ప్రజాప్రతినిధులు సహకరించి 18 ఏళ్లు పైబడిన వారందరూ పరీక్షలు చేయించుకునేలా అవగాహన కల్పించాలన్నారు.



తెల్లరాళ్లపల్లిలో కంటి పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

**167 మందికి పరీక్షలు**

**పెబ్బేరు రూరల్:** శ్రీరంగాపురం మండలంలోని తాటిపాముల పంచాయతీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన కంటివెలుగు శిబిరంలో 167 మందికి పరీక్షలు నిర్వహించినట్లు మండల వైద్యాధికారి రాముడు తెలిపారు. ఆరుగురికి రీడింగ్ అద్దాలను, 21 మందికి అద్దాల తయారీకి పంపిచామన్నారు. ఆరుగురికి ఆపరేషన్ అవసరం ఉన్నట్లు తెలిపారు.

# డబ్బులు చెల్లించాలని బీఎల్ఓల ధర్నా



పాన్‌గల్‌లో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీఎల్ఓలు



వీపనగండ్లలో..

**పాన్‌గల్:** పెండింగ్‌లో ఉన్న బీఎల్ఓల పారితోషకం చెల్లించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట మంగళవారం బీఎల్ఓలు ధర్నా నిర్వహించారు. సీఐటీయూ మండల కన్వీనర్ రాము మాట్లాడుతూ.. బీఎల్ఓలుగా విధులు నిర్వహించిన అంగన్‌వాడీలకు పారితోషకం డబ్బులు ఏళ్ల తరబడి చెల్లించకపోవడం దారుణం అన్నారు. అన్ని జిల్లాల్లో చెల్లించినా కొల్లాపూర్ నియోజకవర్గంలో చెల్లించకపోవడం వివక్షత చూపడమే అన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ యేసయ్యకు అందజేశారు. కార్యక్రమంలో సరళదేవి, కల్పన, కాశమ్మ, లక్ష్మి, అలివేలు, తిరుపతమ్మ, వెంకటమ్మ పాల్గొన్నారు.

**వీపనగండ్ల:** తహసీల్దార్ కార్యాలయం ఎదుట బీఎల్ఓలు ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉన్నతాధికారులు స్పందించి తమకు రావాల్సిన డబ్బులు ఇప్పించాలని కోరారు. అనంతరం తహసీల్దార్ పాండునాయక్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో నిక్సన్, సుగుణాబాయి, లక్ష్మీదేవి, సువర్ణ, మాధవి తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ ధ్రువపత్రాలు ఇచ్చే వరకు పోరాటం

**అమరచింత:** మదాసి, మదారి కురువలకు ఎస్సీ కులధ్రువీకరణ పత్రాలను వెంటనే జారీ చేయాలని సంఘం నాయకులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో మంగళవారం నిరసన చేపట్టారు. బస్టాండ్‌లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, అనంతరం ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయం వరకు వచ్చి అక్కడే దీక్షకు కూర్చున్నారు. నాయకులు మాట్లాడుతూ.. చదువులకు దూరంగా ఉన్న తమ తెగల ప్రజలకు ఇంతకాలం బీసీ బీగా గుర్తించి ధ్రువపత్రాలు ఇచ్చారని, ఇప్పుడు వాటిని వెనక్కి తీసుకుని ఎస్సీలుగా గుర్తించాలన్నారు. ఎన్నికల సమయంలో తమను ఓటు బ్యాంకుగా మార్చుకున్నారే తప్పా తమ తెగకు చేస్తున్న అన్యాయాలను అరికట్టలేకపోతున్నారని అన్నారు. అనంతరం తహసీల్దార్ చాంద్‌పాషాకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో బాల్‌రాజ్, వెంకటన్న, ఆంజనేయులు, బాలకృష్ణ, కుర్వరాజు, శ్రీను, మల్లేష్ పాల్గొన్నారు.



తహసీల్దార్ కార్యాలయం ఎదుట దీక్షలో కూర్చున్న నాయకులు

### వైద్యసిబ్బందికి సన్మానం



వైద్యసిబ్బందిని సన్మానిస్తున్న గ్రామస్తులు

**ఖిల్లాఘనపురం:** మండలంలోని ఉప్పరిపల్లిలో మూడు రోజులుగా కంటి వెలుగులో భాగంగా ప్రజలకు కంటిపరీక్షలు నిర్వహించారు. మంగళవారం చివరిరోజు 213 మందికి పరీక్షలు నిర్వహించగా ఐదుగురికి అద్దాలు ఇచ్చినట్లు వైద్యాధికారులు రాంచంద్రారెడ్డి తెలిపారు. ఆపరేషన్ కోసం ఇద్దరిని గుర్తించామన్నారు. గ్రామంలో ప్రజలకు అందించిన సేవలకుగాను సర్పంచ్ రాంరెడ్డి ఆధ్వర్యంలో వైద్యసిబ్బందిని శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ బాల్‌రాజు, వైద్యులు మక్బూల్, నర్సింహులు, ఏఎన్ఎం బాలనర్సమ్మ, ఆశాకార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

### ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయండి

**కొత్తకోట రూరల్:** పెద్దమందడి మండలంలోని వెల్టూర్ శివారులో గల గోపాల సముద్రం చెరువు వద్ద రైతులతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు రైతుబంధు జిల్లా అధ్యక్షుడు జగదీశ్వర్‌రెడ్డి, జెడ్పీటీసీ రఘుపతిరెడ్డి తెలిపారు. ఈ సమ్మేళనంలో ఎనిమిదేళ్లలో బీఆర్ఎస్ చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల గురించి మంత్రి నిరంజన్‌రెడ్డి వివరిస్తారన్నారు. మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

### ఆర్థికసాయం అందజేత

**పెబ్బేరు:** పట్టణంలోని వెంకటయ్యగౌడ్ కుటుంబానికి ఆర్ఎంపీ ఉపేందర్‌గౌడ్ మంగళవారం ఆర్థిక సాయం అందించారు. తల్లిదండ్రులను కోల్పోయిన రామకృష్ణగౌడ్, వేణుగౌడ్‌లకు ఎలాంటి ఉపాధి లేకపోవడంతో బున్యాధిపూర్ చెందిన ఆర్ఎంపీ రూ.10 వేలు అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో రాజశేఖర్‌గౌడ్, రవీందర్‌గౌడ్ పాల్గొన్నారు.

# అజోలా నాచు మొక్కపై రైతులకు అవగాహన



**తెలకపల్లి:** అజోలా నాచు మొక్కలపై పాలెం వ్యవసాయ కళాశాల రావేఫ్ విద్యార్థులు మండల పరిధిలోని కార్వంగలో మంగళవారం అవగాహన కల్పించారు. నీటిపై తేలియాడే అజోలా కలుపు మొక్క వరిపొలాలు, లోతు లేని జలపాతాల్లో ఎక్కువగా పెరగుతుందని సూచించారు. నీలి ఆకుపచ్చ నాచుతో వరి సాగుచేయడంతో రైతులకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. యూరియా వినియోగం తగ్గి పెట్టుబడి ఆదా అవుతుందని, పంట భూమిలో చవుడు సమస్య చాలా వరకు పరిష్కారం అవుతుందన్నారు. పశువుల మేతకు ఈ మొక్కతో ఉపయోగాలు ఉన్నాయని, ఎండబెట్టిన అజోలా పొడిలో 25 నుంచి 35 శాతం మాంసకృతులు, 10 నుంచి 15 శాతం లవణాలు, 7 నుంచి 10 శాతం అమైనోఆమ్లాలు ఉంటాయన్నారు. రైతులు దీన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతులు ఆనంద్, సలేశ్వరం, కవితతో పాటు రావేఫ్ విద్యార్థులు జైనాబ్, వైభవి, షరణ్య, పూజ పాల్గొన్నారు.